క్లుప్తంగా

ఘనంగా సత్తెమ్మ తల్లి సంబరం



బిక్కవోలు సత్తెమ్మ తల్లి అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలోని తణుకు వారి సత్తెమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఘటం రూపంలో ఊరేగించారు. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ సంబరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. తీన్‌మార్, బ్యాండు మేళాలతో గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా తణుకు కుటుంబ సభ్యులైన సూరిబాబు మాట్లాడుతూ గత నాలుగు తరాలుగా తమ కుటుంబ సభ్యులు ఈ జాతరను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ జంగా మురళీ కృష్ణారెడ్డి, తణుకు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పాండవుల తీర్థం



పాండవుల తీర్థంలో భక్తుల కోలాహలం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్న పాండవుల తీర్థం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు ఆదివారం, సెలవు దినం కావడంతో మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు కొండకు పోటెత్తారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో కొండ కిక్కిరిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

సూర్యదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



జి.మామిడాడలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి స్వామివారు

పెదపూడి: జి. మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణ మూర్తి స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మాఘమాసం ఆదివారం కావడంతో దూర ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

రూ.50 వేల విరాళం



దుర్గాదేవికి మకరతోరణం నిమిత్తం విరాళం అందజేస్తున్న వెంకటరెడ్డి దంపతులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శివారు పాటి మీద ఉన్న కనకదుర్గ అమ్మవారికి వెండితో తయారు చేస్తున్న మకర తోరణం, తొడుగు నిమిత్తం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, ఆయన సతీమణి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ద్వారంపూడి పద్మారెడ్డి రూ.50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి భక్తులు, దాతలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిఒక్కరూ సమాజంపై సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రకాశం నగర్: వాసవీ సీనియర్ సిటిజన్స్ క్లబ్ నూతన ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక వైశ్యా హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడిగా మండవల్లి మురళీకృష్ణ, కార్యదర్శిగా బూరాడ మురళీ, కోశాధికారిగా వీఎస్ నారాయణ నియమితులయ్యారు. కార్యక్రమానికి ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పది మంది వృద్ధులకు పింఛన్లు, ఇద్దరు విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు.

మేనిఫెస్టో అమలు ఘనత జగనన్నదే

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పందలపాకలో గడప గడపకూ మన ప్రభుత్వం



పందలపాకలో స్థానికులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పందలపాక గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండో రోజు నిర్వహించారు. గ్రామంలో ఎమ్మెల్యేకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు తీరుని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయాల ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజాన్ని సాకారం చేశారన్నారు. గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. నవరత్నాల ద్వారా పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతున్నా చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ అసత్యాలను ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చా పాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, జేసీఎస్ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ పీర్ సాహెబ్, కొంకుదురు పీహెచ్‌సీ కమిటీ సభ్యుడు యాసలపు శ్రీనివాస్, సచివాలయం కన్వీనర్ కర్రి సతీష్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.74 కోట్లతో గ్రామాభివృద్ధి



కొత్తతుంగపాడులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కొత్త తుంగపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: గడచిన మూడున్నరేళ్లలో కొత్తతుంగపాడులో రూ.3.74 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో కరపత్రాల ద్వారా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఈ గ్రామంలో కేవలం రూ.22.67 లక్షలతోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. ఏటా ఈ గ్రామంలో 1301 మందికి రూ.7,66,87,060 వరకు ఆర్థిక ప్రయోజనం లభిస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కమ్మిడి వెంకట్రావును పరామర్శించి, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిన వైద్యల గురించి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న వివిధ సమస్యల పై కూడా ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, సర్పంచ్ కోలపాటి వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, వేమగిరి కృష్ణ, కొండపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తుల ఉత్సవాలు ప్రారంభం

దర్శించుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



స్వామి వార్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నరేంద్రపురంలో పంట పొలాల మధ్య కొలువైన త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) 76వ తీర్థమహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివార్లను దర్శించుకున్నారు. ఉత్సవాల నిర్వాహకులు పంపన శ్రీను, ప్రగడ రామచంద్రరావు, తంగెళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అనంతరం ప్రాంగణంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్రిమూర్తులు ఆలయాలు దేశంలో చాలా అరుదుగా ఉంటాయన్నారు. ఈ గ్రామంలో స్వయంభూగా పంట పొలాల మధ్య వెలిసిన స్వామి వార్లను దర్శించుకునేందుకు ఈ ఐదు రోజులు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారన్నారు. అందుకు అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేయడం హర్షనీయమన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కొల్లి వీర్రాజు, ఆకుల శ్రీను, కుందేటి ప్రసాద్‌లున్నారు.

భజేనారాయణస్వామికి మహా పూర్ణాహుతి



భజేనారాయణస్వామికి శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

రంగంపేట: వడిశలేరులో కొలువైయున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ఘనంగా మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ, శ్రీచక్రస్నానం, గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. కోరుకొండకు చెందిన నున్న శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులుచే ఈ కార్యక్రమాలు అశేష భక్తుల నడుమ నిర్వహించారు.

భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ముమ్మన రాంబాబు రెడ్డి, ఆలయ చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలంలోని రామవరం, పొలమూరు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి ప్రకటించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడారు. ఏఎంసీ నూతన పాలకవర్గ అభినందన సభలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేసిన ప్రసంగంపై మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి విమర్శించడాన్ని ఆయన తప్పుబట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు నాలుగేళ్ల కాలంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి తన సొంత గ్రామం పొలమూరులో రూ.11 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడితే, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఐదేళ్లలో తన సొంతూరు రామవరంలో రూ.5 కోట్లతో మాత్రమే అభివృద్ధి పనులు చేశారన్నారు. ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు పనిచేసిన దివంగత నల్లమిల్లి మూలారెడ్డి, ఎమ్మెల్యేగా ఒకసారి పనిచేసిన రామకృష్ణారెడ్డి హయాంలో కంటే ప్రస్తుత ప్రభుత్వంలో రామవరంలో జరిగిన అభివృద్ధి ఏమిటన్నది గ్రామ ప్రజలందరికీ తెలుసన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిపై చేస్తున్న అసత్య ఆరోపణలు ఇప్పటికైనా మానుకోవాలని మాజీ ఎమ్మెల్యేకు హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం వద్ద ధ్వజ స్తంభం ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. తొలుత పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చంటిబాబుకు ఘన స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శలు

మధురపూడి: ఇటీవల మృతి చెందిన, ప్రమాదవశాత్తు గాయపడిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. కోరుకొండ వైస్ ఎంపీపీ బొరుసు నాగమణి తల్లి సూర్యాకాంతం ఇటీవల మరణించారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. మునగాలలో మాదబోయిన నాగేశ్వరరావు మామయ్య లక్ష్మీమాంబ, అదే గ్రామానికి చెందిన మాదబోయిన పద్మ, బూసి గంగాధర్, కొల్లి రమణ, కోరుకొండకు చెందిన గుమ్మడి ప్రభాకర వీరమల్లయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఎమ్మెల్యే ఆయన పరామర్శించారు. ప్రగాడసానుభూతి తెలిపారు.

బ్లేడు బ్యాచ్ దాడిలో గాయపడిన వారిని..

ఇటీవల రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ మండలం కాపవరంలోని ఇంటికి వస్తున్న బెల్లపు డేవిడ్‌రాజు, ఆయన భార్యపై బ్లేడు బ్యాచ్ దాడి చేయగా గాయపడ్డారు. వారిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మోటారుసైకిల్‌పై వస్తుండగా వెనుకగా వచ్చిన యువకులు దాడి చేసినట్టు డేవిడ్‌రాజు ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, దుండగులను అరెస్టు చేయాలని, ఈ తరహా దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

8 నుంచి పులుగుర్తలో వార్షిక బ్రహ్మోత్సవాలు



పులుగుర్తలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

అనపర్తి: మండలంలోని పులుగుర్తలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమ శాస్త్రానుగుణంగా జరుగుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 8న గోమాత గ్రామ ప్రదక్షిణ, విష్వక్సేన పూజ, రక్షాబంధనం, దీక్షాధారణ, వాస్తు హోమం, ధ్వజప్రతిష్ఠ, శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 9న త్రేతాగ్ని ప్రణయనం, ఆలయ బలిహరణ, ఉక్త హోమాలు, నాగబంధనపూజ, 10న అష్టోత్తర శతఘటాభిషేకం, మూలవిరాట్టుకు అభిషేకపూజలు, నిత్య హోమాలు, శ్రీవారి కల్యాణోత్సవం, 11న బలిహరణ, 12న చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సూత్రధారి సేల్స్‌మెన్

- ప్రభుత్వ మద్యం దుకాణంలో అక్రమ అమ్మకాలు
- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

అనపర్తి: ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడుతున్న సేల్స్‌మెన్, సంబంధిత వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే కుతుకులూరు ప్రభుత్వ మద్యం దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న ఓ వ్యక్తి మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన మల్లిడి గంగిరెడ్డి అనే వ్యక్తికి మద్యం బాటిల్‌కు రూ.5 చొప్పున అధికంగా వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న గంగిరెడ్డిని ఆదివారం అడ్డగించి నిలదీయడంతో తప్పు ఒప్పుకున్నాడు. స్థానికులు ఈ విషయాన్ని వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో పాటు విషయాన్ని రంగంపేట స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రంగంపేట సీఐ వి.వెంకటలక్ష్మి, ఎస్‌ఐ శేఖర్‌బాబులు కుతుకులూరు చేరుకుని ప్రభుత్వ మద్యం షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న పి.వరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అతడిచ్చిన సమాచారం మేరకు గంగిరెడ్డిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుండి 127 మద్యం బాటిళ్లు, రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన ఎ.వీరభద్రరావు నుంచి 32 మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ వెంకటలక్ష్మి తెలిపారు.

ఘనంగా రజకుల బండల పండగ



గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం: సంక్రాంతి పండగ అనంతరం రజకులు నిర్వహించుకునే బండల పండగను ఆదివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. కోరంగి సూర్యనారాయణ సహకారంతో పండగలో భాగంగా గ్రామంలో పల్లకీ ఉత్సవం జరిగింది. పరమేశ్వరుడు కొలువు తీరిన పల్లకీని గరగలతో ఊరేగించారు. అనంతరం చెరువుకు వెళ్లి, చాకిరేవు బండలకు పూజ చేశారు.

300 మందికి వైద్యపరీక్షలు

కడియం: మండలంలోని పొట్టిలంకలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రియా డయాబెటిక్ కేర్ వైద్యులు మెట్ల చందన ప్రియ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విప్పర్తి నిఖిల్, కొత్తపల్లి వేంకటేశ్వరరావు, భీమిరెడ్డి నాగేంద్ర పాల్గొన్నారు.

కౌలురైతుపై దౌర్జన్యం

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున రామకృష్ణా గార్డెన్స్‌ను కౌలుకు చేస్తున్న ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామిపై ఆదివారం పలువురు దౌర్జన్యానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. అప్పలస్వామి గత కొన్నేళ్లుగా బొండాడ రామకృష్ణమూర్తి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆదివారం బొండాడ రంగనాథస్వామి కొంత మంది వ్యక్తులతో వచ్చి ఈ పొలం తమదని పొలాన్ని ఖాళీ చేసి వెళ్లాలని దౌర్జన్యం చేశారు. దీంతో అప్పలస్వామి గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్సై యువి శివనాగబాబు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన కె.జగన్మోహనరావు తన తండ్రి వెంకటేశ్వరరావును రాజానగరంలోని జీఎస్‌ఎల్ ఆసుపత్రికి శనివారం తీసుకువచ్చారు. అనంతరం బంధువులు ఇంటికి బయలుదేరగా మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో జగన్మోహనరావు, వెంకటేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యాయి. వారిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగన్మోహనరావు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్మోహనరావు ఆదివారం కేసు నమోదు చేశారు.

నేడు పందలపాకలో గడప గడపకూ..

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో సోమవారం మూడో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

నేడు స్పందన

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అమ్మాజీ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖల మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారన్నారు. మండల ప్రజలు తమ సమస్యలపై స్పందనలో తెలియపరచాలని ఆమె కోరారు.

జగనన్న కాలనీలో సామూహిక శంకుస్థాపనలు



మర్రిపూడిలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న లబ్ధిదారులు

రంగంపేట: మర్రిపూడి గ్రామంలోని జగనన్న కాలనీలో గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో సుమారు 20 మంది స్థలాలు పొందిన లబ్ధిదారులు ఆదివారం సామూహిక శంకుస్థాపనలు చేశారు. ఎప్పటినుంచో సొంతిల్లు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ముఖ్యమంత్రి జగనన్న స్థలాలు అందించడంతో ఇల్లు కట్టుకుంటున్నామని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ వేము చిరంజీవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ ఒరిగేటి ప్రసన్నకుమార్

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని పాస్టర్, యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఒరిగేటి ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం జంభూపట్నం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాక్యసందేశంలో ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలను అనుసరించాలన్నారు. క్రైస్తవులు బైబిల్ పఠనాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

అనపర్తి: స్థానిక శేషగిరిరావుపేటలోని సాయిరాం మందిరం 21వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జి.ఈశ్వరశర్మ ఆధ్వర్యంలో బాబాకి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్లను వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కోవాతో తయారు చేసిన కేక్‌ను బాబాకు నైవేద్యంగా సమర్పించారు.

ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొని బాబాను దర్శించుకుని బాబాకు నైవేద్యంగా సమర్పించిన కేక్‌ను కట్ చేశారు. దాత తాడి చంద్రశేఖర్‌రెడ్డి ఇచ్చిన పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేషనల్ వెంకటరెడ్డి, వ్యాపారవేత్త తేతలి నారాయణరెడ్డి, నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

బిక్కవోలు: పందలపాకలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆదివారం తమకు అందిన సమాచారంతో పందలపాక పెదవీధిలోని ఓ ఇంటిలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేశామన్నారు. దాడిలో పందలపాకకు చెందిన కెల్ల అయ్యప్ప స్వామి, రొంగల వెంకట అనిల్ కుమార్, షేక్ కన్నా సాహెబ్, కాకరపర్తి శ్రీను, షేక్ మహ్మద్, షేక్ భాషా, కె.శ్రీనివాస్‌లను అరెస్ట్ చేశామన్నారు. వారి నుంచి రూ.45,160 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పది మంది అరెస్ట్

అనపర్తి: స్థానిక పాతవూరులోని లక్ష్మీదేవి చెరువు సమీపంలో పేకాడుతున్న పది మందిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదేవి చెరువు సమీపంలోని ఓ షెడ్డులో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసి రూ.9,815 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అప్పారావు తెలిపారు.

రక్తదాన శిబిరం

ప్రకాశం నగర్: మన బాధ్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రి సంజీవని వలంటరీ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సంస్థ నిర్వాహకుడు గారా అజయ్ కుమార్ రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.